క్లుప్తంగా

వార్డుల్లో పర్యటించిన చైర్‌పర్సన్



తెనాలిరూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శనివారం స్థానిక 31, 32, 36 వార్డులోల పర్యటించారు. ఆయా వార్డుల కౌన్సిలర్‌లతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట కమిషనర్ బి. శేషన్న, హెల్త్ ఆఫీసర్ హెలన్ నిర్మల, పారిశుద్ధ్య, వార్డు సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికుడి పర్సు అప్పగింత



తెనాలిరూరల్: పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన ఏవీ సుబ్రహ్మణ్యం ఈ నెల 25వ తేదీన తిరుపతి వెళ్లేందుకు తెనాలి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైలు ఎక్కే క్రమంలో అతని జేబులో ఉన్న పర్సు ప్లాట్‌ఫాంపై పడింది. పర్సును ప్లాట్‌ఫాంలో విధుల్లో ఉన్న హౌస్ కీపింగ్ అసిస్టెంట్ ఎన్. లలిత గుర్తించి పై అధికారులకు సమాచారం అందించింది. పర్సులో రూ.20,080, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఆధార్ కార్డు ఉన్నాయి. అధికారుల సూచనల మేరకు పర్సును జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రికి అప్పగించింది. పర్సులోని ఆధారాల మేరకు సుబ్రహ్మణ్యం ఆచూకీని గుర్తించారు. శనివారం అతనికి పర్సు, నగదు, కార్డులను అందజేశారు. నగదును అప్పగించిన హౌస్‌కీపింగ్ అసిస్టెంట్ లలితను అధికారులు అభినందించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



తెనాలిరూరల్: విన్సెంట్ డి పాల్ పండుగను పురస్కరించుకుని మండలంలోని అంగలకుదురు గ్రామంలో గల సొసైటీ ఆఫ్ సెయింట్ విన్సెంట్ డి పాల్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఆర్‌సీఎం చర్చి వద్ద జరిగిన కార్యక్రమంలో గురువులు శౌరిరాజు, సునీల్, సెంట్రల్ కౌన్సిల్ ట్రెజరర్ కె.రవిచంద్రబాబు, అంగలకుదురు ఏరియా ట్రెజరర్ పి. బాలస్వామి, అధ్యక్షుడు కె. రాజమోహన్, సీహెచ్ బాలస్వామి, పి. సామియేలు, ఎన్. రవిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈలు బదిలీ

తెనాలిరూరల్: పురపాలక సంఘంలో అసిస్టెంట్ ఇంజినీర్లుగా పని చేస్తున్న పీఎల్‌పీ దీప్య, బి. చైతన్య బదిలీ అయ్యారు. వీరిని గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ఈఎన్‌సీ ఆర్. గోపాలకృష్ణారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



కొల్లిపర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో లేఅవుట్ 2, 3 జగన్న కాలనీల్లో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి,నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో మొదటి దశలో మొత్తం 2300 ఇళ్లు మంజూరుకాగా 930 పూర్తయ్యాయని, మరో 586 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మార్చి 2025 నాటికి 586 మంది నిర్మాణాలు పూర్తి చేసే విధంగా సచివాలయం ఇంజనీర్ అధికారులు, హౌసింగ్ అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి లబ్ధిదారులకు సబ్సిడీ పై రూ 1.80 వేలు అందించటమే కాకుండా ఇళ్ల నిర్మాణాలకు వెలుగు పథకంలో ఉన్న మహిళా సభ్యులు బ్యాంకుల ద్వారా రూ.35,000 రుణాన్ని పొందవచ్చన్నారు.అలాగే ఇళ్ల నిర్మాణస్థాయి ఆధారంగా ఎస్టీ, ఎస్సీ లబ్ధిదారులకు ఉన్నతి స్కీమ్ ద్వారా రూ.50,000 రుణం అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకొని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

వైకుంఠవాసా... చంద్రబాబుకి సద్బుద్ధినివ్వు

- వైకుంఠపురం దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు
- శ్రీవారి లడ్డూప్రసాదం వివాదంపై దేవాలయాల్లో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



వైకుంఠపురం దేవస్థానంలో పూజలు నిర్వహించేందుకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తిరుమలలోని లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న అనుచిత ఆరోపణలపై శ్రీవారి ఆగ్రహం రాష్ట్రంపైనా, రాష్ట్రంలో నివసిస్తున్న ప్రజలపైనా కాకుండా, ఎవరైతే దుర్బుద్ధితో ఆరోపణలు చేస్తున్నారో వారివరకే పరిమితం కావాలన్న ఆకాంక్షను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నాబత్తుని శివకుమార్ వ్యక్తం చేశారు. ఆరోపణలు చేస్తున్నవారికి కూడా సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్టు తెలిపారు.

'చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా వైఎస్సార్ సీపీ తరపున దేవాలయాల్లో పూజలు చేయండి... తప్పు చేసింది మేం కాదు... చంద్రబాబు అని వేడుకోండి...ఆ కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపై చూపమని వేడుకోండి' అంటూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు ప్రకారం పార్టీ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ శనివారం స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నవగ్రహాలను దర్శించారు. ఉత్సవ విగ్రహాల కళ్యాణోత్సవం మండపంలో కూర్చుని స్వామివారిని వేడుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు 'గోవిందా... గోవిందా ... ఏడుకొండలవాడా' అంటూ శ్రీవారిని తలచుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు.

ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత వైకుంఠపురం దేవస్థానాన్ని సందర్శించటం ఇదే తొలిసారిగా శివకుమార్ చెప్పారు. అధికార పార్టీకి హామీల అమలుకు కనీసం ఆరునెలల వ్యవధిని ఇవ్వాలనేది తన భావనగా చెప్పారు. ఆ తర్వాతనే ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకుని ప్రజల్లోకి వద్దామని ఆలోచన చేసినట్టు చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేస్తుండటంతో పార్టీ పిలుపు ప్రకారం వైకుంఠపురంలో పూజలు చేసినట్టు చెప్పారు.

లడ్డూ ప్రసాదం వివాదంపై ఇటీవల వైకుంఠపురంలో యాగం చేసిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆలయంలో జరుగుతున్న అపచారాలను సంప్రోక్షణ చేయాలని శివకుమార్ స్పష్టం చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేయటంపై కాకుండా సూపర్‌సిక్స్ హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆ దేవుడితో చెలగాటమాడినందుకు బుద్ధిచెప్పే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. భగవంతుడితో పరాచికాలు ఆడిన పాపాన్ని అధికారపార్టీ మూటగట్టుకుందని కౌన్సిలర్ కొర్ర యశోద అన్నారు. జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గెడ్డేటి ఝాన్సీవాణి, పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ యలవర్తి గీతాదేవి, ప్రసాదం బాలగురవమ్మ,

మన్నవ శాంతిశ్రీ, గుర్రం హేమలత, రావి ప్రశాంతి, ఇందిరా ప్రియదర్శిని, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్ బాబు, కొల్లిపర మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, మన్నవ ప్రభాకర్, కఠారి హరీష్, వంపుగళ్ల కృష్ణ, భీమవరపు సంజీవరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద బాబు, కొమ్ము రాయల్, పెదలంక వెంకటేశ్వర్లు, షేక్ ఫరీద్, పిల్లి సుధాకర్, పెచ్చింగ్ సుభాని, సిరికృష్ణ, కాళిదాసు సత్యం, కుర్రా శ్రీను, పచ్చవ రమేష్, కుదరవల్లి శంకరరావు, కోలా వాసు, కొడాలి క్రాంతి, న్యాయవాదులు కేఎం విల్సన్, గుంటూరు కృష్ణ, షేక్ మీరావలి, కొల్లా గురునాధగుప్త, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'హ్యారీపోటర్' నటి మాగీస్మిత్ మృతికి సంతాపం

తెనాలి: ప్రముఖ బ్రిటిష్ నటీమని, ఆస్కార్ అవార్డుగ్రహీత మాగీ స్మిత్ (89) మృతికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ) తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేస్తున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హ్యారీపోటర్ సినిమాలో ప్రొఫెసర్ మెక్‌గోనాగల్ పాత్రలో నటనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును పొందిన మాగీ స్మిత్, తన నటజీవితంలో రెండుసార్లు ఆస్కార్ అవార్డును, నాలుగు పర్యాయాలు బ్రిటన్‌లోని ఎమ్మీ అవార్డును సొంతం చేసుకున్నట్టు గుర్తుచేశారు. ప్రపంచంలోని అతికొద్ది నటీనటులు మాత్రమే ఇంతటి గౌరవాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. 1956లో సినీకెరీర్‌ను ప్రారంభించిన మాగీస్మిత్, షేక్స్పియర్ నాటకాల్లోనూ, అనేక సినిమా, టీవీ షోల్లోను పాల్గొన్నట్టు తెలిపారు.

కళాశాలలో ఉచిత దంత వైద్యశిబిరం



తెనాలిరూరల్: పట్టణంలోని ఎస్‌ఆర్‌కే అండ్ కేఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో శివ డెంటల్‌క్లినిక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ ప్రారంభించగా, డాక్టర్ హరిప్రియ వైద్య పరీక్షలు చేశారు.

శభాష్.. తెనాలి పోలీసులు



ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ కోటేశ్వరరావు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సీఐ మల్లికార్జునరావు

తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ పోలీసులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకున్నందుకు శనివారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, కోర్టు కానిస్టేబుల్ కోటేశ్వరరావులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అలానే 2020 సంవత్సరంలో తాడేపల్లిలో జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడే విధంగా అప్పటి తాడేపల్లి సీఐగా ఉన్న వన్‌టౌన్ సీఐను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కొలకలూరులో ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న చొప్పర ప్రీతి

తెనాలి: గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయమని కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో స్వచ్ఛంద సేవ సంస్థ 'డొనేట్ ఫర్ పూర్' ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏబీఎస్, ఆర్సీఎం చర్చి ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ చొప్పర ప్రీతి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో పాల్గొన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ అచింశెట్టి అన్వేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అవసరమన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన హెల్ప్ ఫర్ పూర్ సంస్థ సేవలను కొనియాడారు. సంస్థ నిర్వాహకులు జొన్నలగడ్డ అనుపం, ఎల్ రాకేష్ మాట్లాడుతూ సంస్థ సభ్యులు జొన్నలగడ్డ స్వర్ణముఖి జయంతి సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. శిబిరంలో పల్మనాలజిస్ట్ డాక్టర్ కాసుల సాయిరాజశేఖర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జిల్లేపల్లి తేజస్వి, న్యూరాలజిస్ట్ డాక్టర్ బడుగు పవన్‌లు వైద్యపరీక్షలు చేశారు. మండల తహశీల్దార్ కేవీ గోపాలకష్ణ, దైవసేవకులు నలుకుర్తి సురేష్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, సంస్థ కార్యదర్శి ఎస్.దేవరాజు, సభ్యులు ఆదర్శ్, పూజిత, మంచికలపూడి హోలీ, మంచికలపూడి రవికుమార్, ఎం వెంకటేశ్వరరావు, ఎస్ ఎస్

కొల్లిపర ఎస్ఐకు ఎస్పీ ప్రశంసలు



ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర: ఇటీవలన కురిసిన భారీ వర్షాలు మరియు కృష్ణా నదిలో వచ్చిన వరదల సమయంలో లంక గ్రామ ప్రజలకు పోలీసులు విశేష సేవలు అందించటంతో శనివారం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో కొల్లిపర మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.కోటేశ్వరరావుకు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసులు ప్రజలను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించినప్పుడే పోలీసులపై ప్రజలకు ఉన్న చెడు అభిప్రాయం పోయి పోలీసులు, ప్రజలు మంచి స్నేహితులుగా ఉండటం జరుగతుందని అటు వంటి సమయంలో సమాజంలో నేర ప్రవృత్తి తగ్గుతుందని తెలిపారు. వరదలు సమయంలో కొల్లిపర స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇలాగే నిత్యం ప్రజలకు పోలీసులు మంచి సేవలు అందించాలని కోరారు.

ఘనంగా మహాకవి గుర్రం జాషువా జయంతి



గుర్రం జాషువా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో జాషువాకు నివాళి



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాషువాకు శ్రద్ధాంజలి

తెనాలి: నవయుగ కవిచక్రవర్తి. మహాకవి జాషువా గుర్రం జాషువా 129వ జయంతి రోజైన శనివారం గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్ మాట్లాడుతూ జాషువా జీవనశైలి, కవితల ప్రాశస్త్యం వివరించారు. జాషువా కవితలు ప్రజలను చైతన్యం చేసి స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. సమితి సభ్యులు ఇందుపల్లి రాజారావు, బొల్లిముంత కృష్ణ, వేజెండ్ల రత్నం, లంక ప్రసాద్ రావు, కొండముది రమేష్‌బాబు, కొమ్ము లక్ష్మణరావు, పేరిపోగు రాజగోపాల్, గద్దల ఆల్విన్, ఈపూరి ప్రేమ్‌కుమార్, చొప్పర శ్యామ్, ప్రభాకర్ పాల్గొన్నారు

బీసీ సంక్షేమం సంఘం..

విశ్వ మానవ కళ్యాణానికి తన కవిత్వాన్ని అంకితమిచ్చి, ఆధునిక తెలుగు కవులలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన కవి చక్రవర్తి గుర్రం జాషువాకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఘన నివాళులు సమర్పించారు. జాషువా జయంతి సందర్భంగా సంఘ నాయకులతో కలిసి జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జాషువా జీవిత విశేషాలను వివరించారు. ఆ మహనీయుడు మనందరికీ ఆదర్శమని చెప్పారు. సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, జగ్గడిగుంటపాలెం శ్రీను, జొన్నాదుల వెంకటసాయి, జొన్నాదుల పవన్, మణికంఠ పాల్గొన్నారు.

గుర్రం జాషువా కవిత్వంలో మానవీయ స్పర్శ

మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి సభలో అంబటి మురళీకృష్ణ



మురళీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు చార్లీ చాప్లిన్ హాస్యంలో అంతర్లీనంగా విషాదం ఉన్నట్టే, మహాకవి గుర్రం జాషువా కవిత్వంలో మానవీయ స్పర్శ గోచరిస్తుందని బాపట్ల వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో గుర్రం జాషువా 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త అంబటి మురళీకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, జాషువా చిన్నతనంలో కష్టపడి చందోబద్ధమైన పద్యాన్ని నేర్చుకుని జనం మాట్లాడే సామాన్య భాషను పద్యంలో చొప్పించాడని తెలిపారు. లయబద్ధమైన హృద్యమైన బాణీతో కూడిన ఆ పద్యాలు అందరి నాల్కలపై నడయాడాయని, బాధలు, కష్టాలు అనుభవించటం నుండి తిరగబడటం నేర్పాయని చెప్పారు. అందుకే 129 ఏళ్లయినా ఆయన గురించి నేటికీ చెప్పుకుంటున్నామనీ, ఆయన రచనలనకు నేటికీ ప్రాసంగికత ఉందన్నారు. విశ్వకవి గుర్రం జాషువా సాహిత్య దర్శనం, సామాజిక స్పృహకు నిలువెత్తు నిదర్శనమని కనపర్తి బాబూరావు తన ప్రసంగంలో చెప్పారు. పట్టణానికి చెందిన కవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ జాషువా పద్య స్ఫూర్తితోనే తాను పద్యరచన ప్రారంభించినట్టు తెలియజేశారు. రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి శరత్ వెంకయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, ఇందుపల్లి రాజారామ్, పేరిపోగు రాజగోపాల్, జెల్లి గంటయ్య మాట్లాడారు. సభలో అంబటి మురళీకృష్ణను జాషువా పురస్కారంతో సత్కరించారు. తొలుత రెండు గంటలపాటు శరత్ వెంకయ్య, చిట్టూరి సీతారామయ్య, సీహెచ్ యోహాను పర్యవేక్షణలో కళాకారులచే జాషువా పద్య గానాలాపన జరిగింది. కొండముది రమేష్‌బాబు, వేజండ్ల రత్నం, సుద్దపల్లి మురళీధర్, సీహెచ్ భాస్కరరావు పర్యవేక్షించారు.

మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రీతి, డాక్టర్ అన్వేష్

తెనాలిరూరల్: గ్రామీణ ప్రాంతాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యురాలు జొన్నలగడ్డ స్వర్ణముఖి స్మారకంగా శనివారం స్థానిక ఏబీఎం, ఆర్‌సీఎం చర్చి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో చొప్పర ప్రీతి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్నవారికి ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆచింశెట్టి అన్వేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అవసరమన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి దాని ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ముదావహమన్నారు. వ్యక్తిగతంగా ఆసుపత్రికి రాలేని ప్రజలకు ప్రముఖ డాక్టర్ల చేత గ్రామాల్లో ఉచిత వైద్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాల్లో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం ద్వారా సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని, తద్వారా తగు చికిత్స పొందవచ్చన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ బృందాన్ని ఆయన అభినందించారు. శిబిరంలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాసుల సాయి రాజశేఖర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ జిల్లేపల్లి తేజస్వి, న్యూరాలజిస్ట్ డాక్టర్ బడుగు పవన్ వైద్య సేవలు అందించారు. సంస్థ నిర్వాహకులు జొన్నలగడ్డ అనుపమ్, ఎల్. రాకేష్, సేవకులు నలుకుర్తి సురేష్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, సంస్థ కార్యదర్శి ఎస్. దేవరాజు, సభ్యులు ఆదర్శ్, పూజిత, ఎం. హోలీ, ఎం. రవికుమార్, ఎం. వెంకటేశ్వరరావు, వినయ్ కుమార్, ఎస్. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

• 'చెత్త' పాలన !



పార్కు గోడకు ఆనుకుని చెత్త కుప్ప



పక్కనే మురుగునీటిలో సేదతీరుతున్న పందులు

పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం ఉన్న ఒకే ఒక పార్కు తెనాలి చినరావూరులోని రావి సత్యనారాయణ లేక్‌వ్యూ పార్కు. పార్కు హద్దు గోడలు ఆనుకుని చెత్తను డంపింగ్ చేస్తున్నారు. అటుకేసి వెళ్లేవారికి దుర్గంధం వెదజల్లుతోంది చెత్త. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ నిమిత్తం పలువురు పార్కుకు వస్తుంటారు. సాయంత్రం కాసేపు ఆటవిడుపుగా కోసమని పెద్దలు, పిల్లలు టికెట్ కొని మరీ వెళుతుంటారు. అటువంటి పార్కు ప్రహరీకు ఆనుకొని డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న చెత్త దుర్గంధం వెదజల్లుతూ, పందులకు ఆవాసంగా తయారైంది. చినరావూరు రోడ్డులో నడిచే జనమైతే ముక్కులు మూసుకుని వెళుతున్నారు. ఇక ఆదివారం వస్తే ఆ రోడ్డులోనే చేపల విక్రయం...ఇక వాటి వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేటిరోజుల్లో మున్సిపల్ అధికారులు ఇలాంటి సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. -తెనాలి

యంగ్ తరంగ్‌తో మానసిక ఒత్తిడి దూరం

> ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావు



మాట్లాడుతున్న చందు రామారావు

తెనాలిరూరల్: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, ఉల్లాసాన్ని నింపేందుకు యంగ్ తరంగ్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మెన్ చందు రామారావు అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డు లోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో 'యంగ్ తరంగ్' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చందు రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు చాలా ముఖ్యమన్నారు. విద్యతో పాటు సాహితీ, సాంస్కృతిక, సృజనాత్మక రంగాల్లోను విద్యార్థులు రాణించేలా చక్కని ప్రణాళికలతో ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ముందుకుసాగడం ముదావహమని అన్నారు. ప్రియదర్శిని డిగ్రీ కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, వారికి ఆహ్లాదాన్ని కలుగజేసేలా ప్రతి విద్యాసంవత్సరం అనేక కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బొల్లిముంత శివరామకృష్ణ, సంస్కృతి టీం కన్వీనర్ కాకుమాను వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్ ఐనంపూడి రజనీ, శ్రీసుధా, అపర్ణ, హేమ, ఆరీఫా, నస్రీన్ తదితరులు పర్యవేక్షించారు.

వక్తృత్వ పోటీల్లో నవ్య ప్రతిభ



సూరేపల్లి(భట్టిప్రోలు): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం విద్యార్థుల సలహాలు, సూచనలు, స్వర్ణాంధ్ర- 2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన నవ్యను హెచ్ఎం కె.శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.